సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 30 । జూన్ । 2023



గోవా టు గోదావరి

గోవా మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వైనం చర్చనీయాంశంగా మారింది. మహిళలు గుట్టుచప్పుడు కాకుండా రైలులో వీటిని తరలిస్తున్నారు. 8లో ▸



విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విద్యుత్ మరమ్మతుల పనికి వెళ్లిన యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన ఊటసముద్రం గ్రామంలో చోటుచేసుకుంది. 8లో ▸

ఆట్యా-పాట్యా జట్ల ఎంపిక

భీమవరంలో ఆట్యా-పాట్యా సబ్ జూనియర్స్ బాల, బాలికల జిల్లా జట్లను ఎంపిక చేశారు. వీరు వచ్చేనెల 1 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడతారు.



8లో

న్యూస్‌రీల్

తాడేరు వంతెన పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు

సాక్షి, భీమవరం: నిర్మాణంలో ఉన్న తాడేరు వంతెన పనులను శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు గురువారం పరిశీలించారు. అధికారులను వంతెన నిర్మాణ పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల వలన రైతులకు నష్టం కలగకుండా మోటార్లు ఏర్పాటు చేసి నీటిని మళ్లించాలని ఆదేశించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీరామరాజు, కాంట్రాక్టర్ సుబ్బరాజు ఉన్నారు.

ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి



మృతి చెందిన విజయరాజు

లింగపాలెం: లింగపాలెం మండలం యడవల్లి గ్రామానికి చెందిన అబ్బాదాసరి విజయరాజు (40) ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. విజయరాజు మల్లేశ్వరం గ్రామంలో విద్యుత్ స్తంభంపై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే విద్యుత్ షాక్ తగిలిందా.. లేకుంటే కింద పడటంతో గాయపడి మృతిచెందాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

చేపను ఎరచూపి.. గొలుసును కాజేసి..

ఉండి: చేతికి చేప ఇవ్వడంతో ఉబ్బితబ్బిబైన మహిళ బంగారు గొలుసు పోగొట్టుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి మండలం మహదేవపట్నం ఉత్తరపాలెంకు చెందిన కేతా ఉదయకుమారి అనే మహిళ ఇంటికి అద్దెకు ఇల్లు కావాలంటూ పితాని కుమార్ అనే వ్యక్తి వచ్చాడు. తనది భీమవరం అని గ్రామంలో చెరువులు సాగు చేస్తున్నానని నమ్మించాడు. దీంతో ఉదయకుమారి తన సమీపంలోని ఇంటిని అతడికి అద్దెకు పురమాయించింది. ఈ నేపథ్యంలో ఈనెల 14న సాయంత్రం 4 గంటలకు తమ చెరువులో పండిన చేప అని తీసుకువచ్చి ఉదయకుమారికి ఇచ్చాడు. ఆమె చేపను తీసుకుని రిఫ్రిజిరేటర్‌లో పెట్టేందుకు వెళ్లగా.. కుమార్ ఆమె ఇంట్లోని బీరువాలో సుమారు 6 కాసుల బంగారు గొలుసును దొంగిలించి ఉడాయించాడు. తర్వాత విషయం తెలుసుకున్న ఉదయకుమారి అతడి ఆచూకీ కోసం గాలించినా ప్రయత్నం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఉదయకుమారి ఫిర్యాదు మేరకు గురువారం ఎస్సై కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నారుమడులను వేగిరపర్చాలి

భీమవరం అర్బన్: వరి నారుమడులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. తొలకరి వర్షాలు పడుతున్నాయని ముందస్తు సార్వా సాగు చేస్తే అక్టోబర్, నవంబర్‌లో వచ్చే భారీ వర్షాలు, తుఫాన్‌ల దాటి నుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు. రైతులు త్వరితగతిన నారుమడులు పూర్తి చేయాలని కోరారు. ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 1318, స్వర్ణ రకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కిలో విత్తనాలు రూ.5 సబ్సిడీపై రైతు భరోసా కేంద్రాలు, డీసీఎంఎస్‌లలో విక్రయిస్తున్నారని, రైతులు ఆర్‌బీకే సెంటర్లలో సంప్రదించాలని కోరారు. అలాగే యూరియా, పొటాషియం, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

చురుగ్గా ఎల్‌సీడీ సర్వే



సర్వే చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

పాలకోడేరు: జిల్లావ్యాప్తంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ సర్వే (ఎల్‌సీడీఎస్) చురుగ్గా సాగుతోంది. వైద్యారోగ్య సిబ్బంది గురువారం విస్సాకోడేరులో ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. అలాగే గ్రామాల్లో వైద్యారోగ్య, ఐసీడీఎస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి రోజుకు 25 ఇళ్లకు పైగా సర్వే చేస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రంగమనాయుడు మాట్లాడుతూ సర్వే ఈనెల 27న ప్రారంభమైందని, వచ్చేనెల 16 వరకు సాగుతుందన్నారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఎవరికైనా కుష్టు సంబంధిత మచ్చలు ఉంటే వైద్యులకు తెలియజేస్తారన్నారు. వ్యాధి నిర్ధారణయితే పీహెచ్‌సీ ద్వారా చికిత్స అందిస్తామని అన్నారు.

నేత్రపర్వం.. జగన్నాథ రథోత్సవం





జగన్నాథుని రథోత్సవం, రథంలో కొలువైన దారు విగ్రహాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రానికి ఉపాలయం లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జగన్నాథుని దివ్య రథోత్సవం గురువారం నేత్రపర్వంగా జరిగింది. ఈనెల 20 నుంచి ఆలయంలో జరుగుతున్న రథయాత్ర ఉత్సవాలు ఈ వేడుకతో ముగిశాయి. ముందుగా ఆలయం వద్ద రథాన్ని సుందరంగా అలంకరించారు. సుభద్ర, బలభద్ర, జగన్నాథుని దారు, ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి రథంలో వేంచేపు చేసి విశేష పూజలు చేశారు. ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, బలిహరణ సమర్పించారు. అనంతరం భక్తుల నామస్మరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ రథం సమీప గ్రామం తిమ్మాపురం బయలుదేరి.. తిరిగి రాత్రికి ఆలయానికి చేరుకుంది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

తొలి ఏకాదశి.. పుణ్యాల రాశి



శ్రీవారి క్షేత్రం.. భక్త జన సంద్రం

ద్వారకాతిరుమల : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం గురువారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తుల రద్దీ కనిపించడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. తొలి ఏకాదశి నాడు స్వామిని దర్శిస్తే ఏడాదంతా శుభం కలుగుతుందనే నమ్మకంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. తూర్పురాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, అన్నదాన సదనం ఇతర విభాగాలన్నీ భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం వరకు భక్తుల తాకిడి కనిపించింది. ఆలయ అనివెట్టి మండపంలో పలు భజన మండళ్ల సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి.

నిర్మాణం.. శరవేగం

సచివాలయం.. సుందర భవనం

- ఏలూరు జిల్లాలో 491 గ్రామ సచివాలయాలకు భవనాలు
- రూ.196.40 కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వం
- ఇప్పటికే 272 భవనాల నిర్మాణం పూర్తి



జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో సచివాలయ భవనం

జంగారెడ్డిగూడెం: మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. వీటి ద్వారా ప్రజల ఇంటి వద్దకే పాలనను చేరువ చేశారు. దీనిలో భాగంగా ఏలూరు జిల్లాలో గ్రామ సచివాలయాల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. అన్నిరకాల మౌలిక వసతులు, పక్కా భవనాలతో నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలో 491 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.196.40 కోట్లు వెచ్చిస్తోంది.

సొంత భవనాలు ఉండేలా.. కొత్తగా వ్యవస్థలు ఏర్పడినప్పుడు వాటిని నడిపించేందుకు సొంత భవనాలు లేకపోవడం, అద్దె భవనాల్లో నిర్వహించడంతో ఇబ్బందులు తలెత్తేవి. ఇటువంటి పరిస్థితి గ్రామ సచివాలయాలకు ఏర్పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సొంత భవనాల నిర్మాణం చేపట్టింది. దీనిలో భాగంగా ప్రతి సచివాలయ భవనానికి రూ.40 లక్షలు కేటాయించడంతో పాటు గ్రామ పరిధిలోనే నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంది. ఈ మేరకు జిల్లాలో చేపట్టిన నిర్మాణాలు 50 శాతానికి పైగా పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

జీ ప్లస్ వన్‌గా.. సచివాలయాలను జీ ప్లస్ వన్ భవనాలుగా నిర్మాణాలు చేపట్టారు. అన్ని శాఖల అధికారులు సచివాలయాల నుంచే పరిపాలన అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అధునాతన వసతులు కల్పిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 272 భవన నిర్మాణాలు పూర్తి కాగా, వీటిలో చాలా వరకు ప్రారంభోత్సవాలు పూర్తయి ప్రజలకు సేవలు అందిస్తున్నాయి.

జిల్లాలో గ్రామ సచివాలయాలు ఇలా..

నిర్మాణం చేపట్టినవి	491
నిర్మాణం పూర్తయినవి	272
తుది దశలో ఉన్నవి	88
రెండో శ్లాబ్ పూర్తయినవి	35
మొదటి శ్లాబ్ పూర్తయినవి	22
రూఫ్ స్థాయికి పూర్తయినవి	39
పునాది స్థాయిలో ఉన్నవి	27
పునాది కంటే కింది స్థాయిలో	3
నిర్మాణం ప్రారంభం కానివి	5

ఒక్కో భవనానికి రూ.40 లక్షలు



జిల్లాలో సచివాలయాల నిర్మాణాలు వేగవంతం చేశాం. ప్రభుత్వం ఒక్కో భవనానికి రూ.40 లక్షలు మంజూరు చేసింది. ఇప్పటి వరకు పూర్తయిన నిర్మాణాలకు దశల వారీగా బిల్లులు కూడా చెల్లించాం. నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. బేస్‌మెంట్ స్థాయి నుంచి శ్లాబ్ వరకు పూర్తయిన భవనాలను సెప్టెంబర్ నాటికి, బేస్‌మెంట్ కన్నా కింద స్థాయిలో ఉన్న భవనాలను డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.

– కె.శ్రీను, పీఆర్ ఈఈ, జంగారెడ్డిగూడెం

పారదర్శకంగా పథకాల అమలు



తూర్పుపాలెంలో మహిళకు స్థల ధ్రువీకరణ పత్రం అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: అత్యంత పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెంలో గురువారం లబ్ధిదారులకు ఇంటి స్థల ధ్రువీకరణ పత్రాలు అందించారు. రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని, వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలివడంతో పాటు పేదలకు అండగా నిలుస్తున్నాయన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పథకాలు అందని వారిని గుర్తించి వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పేదలకు అందిస్తున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఎవరూ వారి మాటల్లో పడి మోసపోవద్దని, అందరూ సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద) తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలో అవినీతిపై చర్చిద్దామా..

ఎమ్మెల్యే నిమ్మలకు ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ సవాల్



పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుని ఉద్దేశించి చేసిన విమర్శలపై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదల కోసం పనిచేస్తామని చెప్పకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని దుర్భాషలాడటం సిగ్గుచేటన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకొల్లు పట్టణంలో అవినీతి ఏ మేరకు జరిగిందో బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ సవాల్ చేశారు. నీరు-చెట్టు కార్యక్రమంలో ట్రీ గార్డుకి కేవలం రూ.300 ఖర్చు అయితే పట్టణంలోని వ్యాపారులు, ప్రైవేట్ స్కూళ్ల నుంచి ఏ మేరకు దోచుకున్నారో ప్రజలందరికీ తెలుసని అన్నారు. టిడ్కో గృహాలు 300 చదరపు గజాల ప్లాట్‌ను పేదలకు ఉచితంగా ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అదే లబ్ధిదారుడిని బ్యాంకులను 20 ఏళ్ల తాకట్టు పెట్టే ప్రయత్నం తెలుగుదేశం పార్టీ చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దమ్మయ్యపత్తి డ్రైయిన్ విషయంలో కాంట్రాక్టర్‌ని బెదిరించి 20 శాతం కమిషన్ ఇవ్వని కారణంగా పోలీసు కేసు పెట్టి వేధించడం నిజం కాదా అని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ నిలదీశారు. సీఎం జగన్‌ని ఏకవచనంతో మాట్లాడలేదా అని ప్రశ్నించారు. మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుని ఉద్దేశించి ఎమ్మెల్యే రామానాయుడు చేసిన వ్యాఖ్యలు తక్షణం వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

'పశ్చిమ' కలెక్టర్ ప్రశాంతి



పెదకాపవరంలో సూచనలిస్తున్న కలెక్టర్

ఆకివీడు: రాష్ట్రంలో ప్రతి ఇల్లు సురక్షితంగా ఉండాలని, అర్హులందరికీ పథకాలు అందాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం మండలంలోని చినకాపవరం, పెదకాపవరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం అమలు తీరుపై మండల అధికారులు, సచివాలయ సిబ్బందితో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లాలని, అర్హత ఉన్నా లబ్ధి పొందలేని వారి పేర్లను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. గ్రామాల్లో వలంటీర్లు సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అధికారి, మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. జగనన్న సురక్షపై ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. ప్రజా దరఖాస్తులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నింటినీ ఉచితంగా సచివాలయాల వద్ద అందజేస్తారన్నారు. అనంతరం ఎంపీపీ జయలక్ష్మితో కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరును పర్యవేక్షించాలని కోరారు. మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఎంపీడీఓ కందుల వాణి, తహసీల్దార్ ఎంబీ విజయలక్ష్మి, సర్పంచ్ ఊసల బేబీ స్నేతు, పాతపాటి శ్రీనివాసరాజు తదితరులు ఆమె వెంట ఉన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ సస్పెన్షన్‌కు చర్యలు

పెదకాపవరం వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఇన్‌చార్జి డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.కిరణ్ సస్పెన్షన్‌కు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కంప్యూటర్ ఆపరేషన్ పనుల్ని ప్రైవేట్ వ్యక్తితో చేయిస్తుండటంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గ్రామ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్న నారాయణరావుకు మెమో జారీ చేయాలని సూచించారు. డిజిటల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉన్నా తెలియజేకపోవడం, ప్రైవేట్ వ్యక్తితో పని చేయించడం సరికాదన్నారు. సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీడీఓ వాణిని ఆదేశించారు.

ఏలూరులో కిడ్నీమార్పిడి రాకెట్ ముఠా

- బాధితురాలి ఫిర్యాదుతో వెలుగులోకి..
- రూ.7 లక్షలకు ఒప్పందం.. రూ.2 లక్షలు బాకీ
- ఆధార్ కార్డులో పేర్ల మార్పుతో ఇబ్బందులు



వివరాలు తెలుపుతున్న బాధితురాలు అనురాధ, తల్లి లక్ష్మి

ఏలూరు టౌన్: కిడ్నీ మార్పిడి రాకెట్ ముఠా ఏలూరులోనూ తిష్టవేసి అమాయకులను ట్రాప్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఏలూరు నగరానికి చెందిన మహిళకు డబ్బు ఆశ చూపి ఆమె కిడ్నీ కాజేశారు. ఒప్పందం మేరకు సొమ్ము ఇవ్వకుండా మోసం చేయటంతో ఆమె ఏలూరు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. కిడ్నీ ఇచ్చిన మహిళ ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతూ తనకు న్యాయం చేయాలంటూ పోలీసులను వేడుకుంటోంది. బాధితురాలి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఏలూరు వన్‌టౌన్ బెనర్జీపేటకు చెందిన బూసి అనురాధ అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. కొవ్వలిలో భర్తతో కలిసి ఉండేది. భర్తతో విభేదాలు రావటంతో తన ఇద్దరు పిల్లలతో బెనర్జీపేటలో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రసాద్ అనే వ్యక్తి ఆమెకు పరిచయమయ్యాడు. కిడ్నీ అమ్మితే పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తారని ఆశ చూపించాడు. అతని మాటలు నమ్మిన అనురాధ కిడ్నీ అమ్మేందుకు అంగీకరించింది.

విజయవాడలో ఆపరేషన్..

కిడ్నీ అమ్మితే రూ.7 లక్షలు ఇస్తామని సదరు వ్యక్తులు బేరం కుదుర్చుకున్నారు. ఒప్పుకున్న అనురాధను గతేడాది మార్చి 23న విజయవాడ గుణదల రోడ్డులోని విజయ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్చారు. మూడు రోజులు వైద్య పరీక్షలు చేశారు. 26న శస్త్రచికిత్స చేసి కిడ్నీ తొలగించారు. నిడమానూరుకు చెందిన యర్రంశెట్టి ఉదయ్‌కిరణ్ అనే వ్యక్తికి కుడివైపు కిడ్నీ అమర్చినట్టు అనురాధ చెబుతోంది. శస్త్రచికిత్స అనంతరం ఏడు రోజులు ఐసీయూలోనూ, మరో ఐదు రోజులు వార్డులోనూ వైద్య చికిత్స అందించి ఆమెను ఇంటికి పంపారు. అనురాధకు శస్త్రచికిత్స చేసే ముందురోజు 25న హాస్పిటల్ వద్ద రూ.5 లక్షలు అందజేశారు. ఈ డబ్బులో రూ.4 లక్షలు తన బంధువుల ఖాతాలో వేయించిన బాధితురాలు లక్ష రూపాయలు తన వద్ద ఉంచుకుంది. తనకు ఇవ్వాల్సిన మరో రూ.2 లక్షలు ఇవ్వకుండా మోసం చేశారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ఆధార్ కార్డులో పేర్ల మార్పుతో..

బాధితురాలు అనురాధ ఆధార్ కార్డులో పేర్లు మార్పు చేయటంతో ఆమెకు ప్రభుత్వపరంగా రావాల్సిన సంక్షేమ పథకాలు, ఇంటి నిర్మాణ పనులు ఆగిపోయాయని ఆమె తల్లి లక్ష్మి చెబుతుంది. అనురాధకు ఆధార్ కార్డులో మార్పులు చేశారనే విషయం వలంటీర్ చెబితేనే తెలిసిందని, అప్పుడే వాళ్లు చేశారని గుర్తించామని తెలిపారు. కిడ్నీ వేరే వ్యక్తికి ఇస్తున్నట్టు ముందుగా తల్లి లక్ష్మికి, పిల్లలకు అనురాధ చెప్పలేదని కుటుంబసభ్యులు అంటున్నారు. హైదరాబాద్‌లో తెలిసినవారి ఇంట్లో పనికి వెళ్లానని తల్లి, పిల్లలకు చెప్పిందని తెలిపారు. నాలుగైదు నెలలుగా బాధితురాలు నీరసంగా ఉండటం తరచూ జ్వరం వస్తుండటంతో తల్లి ఆరా తీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తల్లి తన కుమార్తె అనురాధను తీసుకుని ఏలూరు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఆధార్ కార్డు మార్పుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు రావటం లేదని, తమకు న్యాయం చేయాలని వీరు కోరారు. ప్రస్తుతం బాధితురాలి ఆరోగ్య పరిస్థితి దయనీయంగా ఉందని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జుల నియామకం

సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జేసీఎస్ (జగనన్న సురక్ష సర్వే) మండల ఇన్‌చార్జులను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గాల వారీగా జేసీఎస్ మండల ఇన్‌చార్జిల వివరాలు..

భీమవరం : భీమవరం రూరల్ మండలానికి కోమటి రాంబాబు, భీమవరం పట్టణం క్లస్టర్–1 (1, 2, 3, 11, 12, 13, 14, 15, 16, 17, 18, 19, 20, 21, 22, 23, 24, 25, 26, 27 వార్డులు) నల్లం శ్రీరాములు, క్లస్టర్–2 (28, 29, 30, 31, 32, 33, 34, 35, 36, 37, 38, 39 వార్డులు) గాదిరాజు సుబ్బ తాతరాజు, క్లస్టర్–3 (4, 5, 6, 7, 8, 9, 10 వార్డులు) చెల్లబోయిన సూర్యప్రకాష్, వీరవాసరం మండలం మానుకొండ ప్రదీప్.

ఉండి : ఆకివీడు మండలం పుప్పాల సత్యనారాయణ, ఆకివీడు (ఎన్‌పీ) సిరపు శ్రీనివాస్, కాళ్ల మండలం వీరమల్లు గంగయ్య, పాలకోడేరు మండలం పాలా రాధాకృష్ణ, ఉండి మండలం బులుసు వెంకట రామకృష్ణ.

నరసాపురం : నరసాపురం పట్టణం గోరు సత్తిబాబు, నరసాపురం రూరల్ మండలం తిరుమాని రామకృష్ణంరాజు, మొగల్తూరు మండలం కల్లాబత్తుల రవికుమార్.

పాలకొల్లు: పాలకొల్లు మండలం పార్శి వెంకటరత్నం, పాలకొల్లు పట్టణం మద్దాల శ్రీనివాసరావు, యలమంచిలి మండలం ఉచ్చెల స్టాలిన్, పోడూరు మండలం బళ్ల రాజశేఖర్.

ఆచంట: ఆచంట మండలం తాడాల నాగ దుర్గా చంద్రశేఖర్, పెనుగొండ మండలం సాకా వెంకట సుబ్రహ్మణ్యం, పెనుమంట్ర మండలం కొవ్వూరి రామకృష్ణ సూర్య సత్యనారాయణ రెడ్డి, పోడూరు మండలం పైడి ఏసుబాబు.

తణుకు :

తణుకు మండలం కారిబండి రాజేష్, తణుకు పట్టణం ఇందుగపల్లి బలరామకృష్ణ, అత్తిలి మండలం పెన్మెత్స రామరాజు, ఇరగవరం మండలం మేడపాటి శ్రీరామ దినేష్‌రెడ్డి.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం మండలం ముప్పిడి సంపత్‌కుమార్, తాడేపల్లిగూడెం పట్టణం క్లస్టర్–1 (1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10, 11, 12, 26, 27, 28, 29, 30, 31, 32, 33, 34, 35 వార్డులు) కె.ధర్మరాజు, తాడేపల్లిగూడెం క్లస్టర్–2 (13, 14, 15, 16, 17, 18, 19, 20, 21, 22, 23, 24, 25 వార్డులు) కె.భాస్కరరావు.

క్లుప్తంగా

పోటెత్తిన పారిజాతగిరి



జంగారెడ్డిగూడెం: తొలి ఏకాదశి సందర్భంగా గురువారం ఉదయం నుంచి పారిజాతగిరి భక్తులతో పోటెత్తింది. గురువారం ఉదయం ఆరాధన, తోమాలసేవ, తీర్ధ ప్రసాదగోష్టి అనంతరం స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అష్టోత్తర పూజలు, కేశవనామార్చనలు, స్పెషల్ దర్శనం చేసుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ప్రసాద వితరణకు తగు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు వాసవీ సాయి నగేష్, పి.జగపతి రాజు, రెడ్డి రంగ ప్రసాద్, కంది బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శిని కలిసిన ఉద్యాన వర్సిటీ వీసీ



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిని కలిసిన ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిని ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ టి.జానకీరామ్ గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. మరోసారి వీసీగా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. వీసీ వెంట వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు ఉన్నారు.

బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్న ఇద్దరిపై కేసు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్న వ్యక్తులపై ఎస్సై బి.మోహన్ రావు కేసు నమోదు చేశారు. కొవ్వాడ పుంతలో అల్బర్ట్ సెల్వ కవిరాజ్ మరో ఇద్దరు కలిసి ఇద్దరు మహిళలతో బలవంతంగా వ్యభిచారం చేయిస్తుండగా.. దాడి చేసి మహిళలను రక్షించామన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవా టూ గోదావరి

- రైలులో జిల్లాకు మద్యం అక్రమ రవాణా
- బాపట్ల జిల్లా కేంద్రంగా దందా



పట్టుకున్న మద్యం సీసాలతో కైకలూరు పోలీసులు(ఫైల్)

కైకలూరు: ఏలూరు జిల్లాలోకి గోవా మద్యం అక్రమ రవాణా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కైకలూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం ముగ్గురు మహిళల నుంచి 24 బ్యాగులలో ఏకంగా 2,949 మద్యం బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.4,54,400 ఉంటుందని అంచనా.. గతంలో తెలంగాణ నుంచి అక్రమ మద్యాన్ని ఏపీకి తెచ్చేవారు. తెలంగాణ నుంచి అక్రమ మద్యం రవాణాకు చెక్‌పోస్టుల వద్ద అడ్డుకట్ట వేయడంతో ఇప్పుడు ట్రైన్ల ద్వారా గోవా నుంచి ఏపీ రవాణా చేస్తున్నారు.

బాపట్ల జిల్లా చీరాల మండలం, ఓడరేవుల గ్రామం వైఎస్సార్‌కాలనీకి చెందిన మహిళలు ఈ మద్యం రవాణాలో కీలక పాత్ర పోషిస్తోన్నారు. గతంలో వీరిపై సారా విక్రయ కేసులు నమోదయ్యాయి. ఇప్పుడు కొందరు ముఠాలుగా ఏర్పడి ముంబయి మీదుగా గోవాకు రైలులో చేరుకుంటున్నారు. అక్కడ మద్యం కొనుగోలు చేసి తిరిగి ముంబయి-విశాఖ ఎల్‌టీటీ రైలు ద్వారా ఆంధ్రాకు వస్తున్నారు. ఇలా నెలలో ముఠాలు రెండు సార్లు వెళ్లి వస్తున్నారు. గోవాలో కొనుగోలు చేసిన మద్యం సీసాలను లగేజీ బ్యాగ్‌లలో ప్యాకింగ్ చేయడానికి ప్రత్యేక ముఠా గోవాలో ఉన్నట్లు తెలుస్తోంది.

పోలీసుల గస్తీ లేని స్టేషన్ల ఎంపిక

గోవా నుంచి ముంబయి, విజయవాడ మీదుగా విశాఖపట్నం ఎల్‌టీటీ రైలు రాత్రి వేళలో ప్రయాణిస్తోంది. ఈ రైలును అక్రమ రవాణాకు ఎంచుకుంటున్నారు. ప్రయాణికుల మాదిరిగా నలుగురు మహిళలు వేర్వేరు బోగీలలో మద్యం సీసాల లగేజీ బ్యాగులను సీటు అడుగుభాగంలో ఉంచుతున్నారు. ఉదయం విజయవాడ దాటిన తర్వాత రైల్వేస్టేషన్లలో పోలీసుల గస్తీ తగ్గుతుంది. విజయవాడ స్టేషన్ తర్వాత ఎల్‌టీటీ ట్రైన్ గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం వంటి స్టేషన్లలో ఆగుతోంది. వీరు కైకలూరు, ఆకివీడు స్టేషన్లలో లగేజీలు దించుతున్నారు. ఆ తర్వాత పాసింజర్ రైలులో ఎక్కించి రామవరప్పాడు స్టేషన్‌లో దిగి అక్కడ నుంచి వాహనాల ద్వారా అనుకున్న ప్రాంతానికి తరలిస్తున్నారు. ఈ ముఠాలో సభ్యులు ఆయా స్టేషన్ల వద్ద ముందుగానే ఉంటూ ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్ల ద్వారా మహిళలకు సమాచారాన్ని అందిస్తున్నారు.

గోవాలో ఫుల్‌బాటిల్ ధర రూ.270 ఉంటే ఇక్కడ రూ.800 నుంచి రూ.1000, క్వార్టర్ బాటిల్ రూ.26 ఉంటే ఇక్కడ రూ.150 నుంచి రూ.200కి విక్రయిస్తున్నారు. రైలులో వీరు బ్యాగులను అక్కడక్కడ సీట్ల కింద ముందుగానే సర్దుతున్నారు. దీంతో పోలీసులు ప్రయాణికుల బ్యాగులుగా భావించి తనిఖీ చేయడం లేదు. రైల్వే పోలీసుల నిఘా లేనిచోట ముందుగానే గమనించి ఆ స్టేషనలో అక్రమ మద్యాన్ని దించుతున్నారు.

అక్రమ మద్యం విక్రయాలు అడ్డుకుంటాం



స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో(సెబ్) సిబ్బంది మద్యం అక్రమ విక్రయాలపై దాడులు చేస్తుంది. పోలీసులు గ్రామాల్లో తనిఖీలు చేస్తున్నారు. రైలు, బస్ స్టేషన్ల వద్ద ఎవరైన అనుమానంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. రాత్రి సమయంలో మరిన్ని తనిఖీలు చేపడతాం.

– ఆకుల రఘు, పట్టణ సీఐ, కైకలూరు

బక్రీద్ ప్రార్థనలు



బక్రీద్ పండుగ సందర్భంగా ఏలూరు కర్బలా మైదానంలో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు



ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లిం సోదరులు, చిన్నారులు

పోలవరం నిర్మాణం, పునరావాసానికి నిధులివ్వాలి



కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో పోలవరం పోరుకేక పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని కన్నాపురంలో పోలవరం పోరుకేక పాదయాత్ర నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, నిర్వాసితుల పునరావాసానికి కేంద్ర ప్రభుత్వమే నిధులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, గుడెల్లి వెంకట్రావు, తామా ముత్యాలమ్మ డిమాండ్ చేశారు. 2014లో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన నాటి నుంచి మోడీ ప్రభుత్వం పునరావాసానికి అయ్యే ఖర్చులో 20 శాతం కూడా ఇవ్వలేదన్నారు. పైగా పునరావాసంతో తమకు సంబంధం లేదని మోడీ ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమన్నారు. 2019లో కాపర్ డ్యాం పూర్తయిన నాటి నుంచి నేటి వరకు పోలవరం నిర్వాసితులు గోదావరిలో నిండా మునిగిపోతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి ఇస్తున్న ప్రాధాన్యత నిర్వాసితుల పునరావాసానికి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పోలవరం నిర్వాసితుల పోరాటానికి రాజకీయాలకు అతీతంగా మద్దతు ప్రకటించాలని కోరారు.

గర్భసంచి వెలుపలి పిండం తొలగింపు

పాలకొల్లులో అరుదైన శస్త్రచికిత్స



మహిళ కడుపులో నుంచి తొలగించిన శిశువు పిండం

పాలకొల్లు సెంట్రల్: గర్భసంచి వెలుపల మహిళ కడుపులోని పేగులకు అతుక్కుని పెరుగుతున్న 27 వారాల పిండాన్ని ఆపరేషన్ చేసి బయటకు తీసిన సంఘటన పాలకొల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జరిగింది. వైద్యురాలు లక్ష్మీ భార్గవి మాట్లాడుతూ నరసాపురం మండలం సీతారామపురం గ్రామానికి చెందిన ఓ మహిళ చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించగా కడుపులో తేడాగా ఉండడంతో స్కానింగ్ చేయించారు. ఆ స్కానింగ్ రిపోర్టులో ఆ మహిళ కడుపులో శిశువు పిండం ఉన్నట్లు గుర్తించారు. గర్భసంచి పక్కన ఉండే పైపు నుంచి ఈ శిశువు కడుపులోకి జారింది. కడుపులో పేగులను చుట్టుకుని వాటి ద్వారా వచ్చే రక్తంతో పిండం తయారైంది.ఈ పిండం పైపు నుంచి ఆమె కడుపులోకి జారి సుమారు రెండేళ్లు అవుతుందని.. కోవిడ్ సమయంలో ఆ మహిళకు కడుపులో నొప్పి రావడంతో వైద్యులను సంప్రదించి మందులు వాడగా నొప్పి తగ్గిందని వైద్యురాలు తెలిపారు. ఆ తరువాత పెద్దగా పట్టించుకోలేదన్నారు. అప్పటి నుంచి ఆమెకు నెలసరి కూడా వస్తుండడంతో ఎలాంటి ఇబ్బంది కలుగలేదు. రెండో గర్భం కోసం రెండు రోజులు క్రితం తనను సంప్రదించగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో విషయం బయటపడింది. గురువారం ఆపరేషన్ చేసి పిండాన్ని బయటకు తీశారు. దీనిని సెకండరీ అబ్డామినల్ ప్రెగ్నెన్సీ అంటారని డాక్టర్ లక్ష్మీ తెలిపారు. ఇది అత్యంత అరుదుగా జరుగుతుందని.. తాను మెడికల్ కళాశాల ట్రైనింగ్‌లో పీజీ చేస్తుండగా ఇలాంటి అరుదైన సంఘటన చూశానని ఇలాంటి సమయంలో ఎక్కువగా రక్తస్రావం జరుగుతుందని, ప్రస్తుతానికి ఆ మహిళకు ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నారు.

ఆట్యా- పాట్యా జట్ల ఎంపిక





జిల్లా బాలుర, బాలికల జట్లు

సాక్షి, భీమవరం: పట్టణంలోని చింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూల్లో ఆట్యా-పాట్యా సబ్ జూనియర్స్ జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన జట్లు జూలై 1, 2 తేదిల్లో తునిలో జరిగే 5వ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని ఆట్యా పాట్యా రాష్ట్ర అధ్యక్షుడు మంతెన రామచంద్రరాజు తెలిపారు. బాలుర జట్టులో జి.యశ్వంత్ రమణ, పి.గోపీకృష్ణ, ఎస్.దేవేంద్ర, పి.రోహిత్ కుమార్, ఎం.భరత్, ఎస్.హేమ హరి సుభాష్, ఐ.దుర్గా శివనాగ సాయి, పి.శంకర్, జె.అభిషేక్ పాల్, జె.లోకేష్, డి.మోహన్, జి.నారాయణరాజు ఎంపికయ్యారు. బాలికల జట్టులో ఎం.మౌనిక, ఎస్.హేమ, ఆర్.మనీషా, ఎ.భువన చంద్రిక, ఎ.శ్రేష్ఠ వర్మ, పి.శ్రీవైష్ణవి, ఎం.తన్వి, ఎస్.భార్గవి, ఎం.కీర్తిసాయిశ్రీ, ఎం.అలేఖ్య, ఎం.సత్యవర్షిణి, ఎం.హేమ శ్రీవల్లి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను పీఈటీ జీపీసీ శేఖర్‌రాజు, హెచ్‌ఎం బి.వి.శ్రీనివాసరావు, జి.కిరణ్ వర్మ, డి.వి.రామభద్రరాజు తదితరులు అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గడపగడపకు సంక్షేమం



ఉండి : ఉండిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ లబ్ధి వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



గణపవరం : మండలంలోని పిప్పరలో మహిళలకు ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని వివరిస్తున్న వాసుబాబు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రంగారావు

చింతలపూడి: విద్యుత్ తీగలు ఆ యువకుడి పాలిట యమపాశాలయ్యాయి. పొట్టకూటి కోసం విద్యుత్ మరమ్మతు పనికి వెళ్ళిన యువకుడిని మృత్యువు కరెంట్ షాక్ రూపంలో కబళించింది. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఊటసముద్రం గ్రామానికి చెందిన జుజ్జువరపు రంగారావు(35) గురువారం గ్రామంలో విద్యుత్ లైన్ మరమ్మతు నిమిత్తం హెల్పర్ పనికి వెళ్ళాడు. విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. రంగారావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

కాల్‌మనీ వేధింపులపై ఫిర్యాదు

నూజివీడు: కాల్‌మనీ పేరుతో వేధిస్తున్న వ్యక్తిపై రూరల్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. మండలంలోని జంగంగూడెంకు చెందిన కోటపాటి సుబ్బారావు, అతని కుమారుడు ప్రదీప్‌లు వ్యవసాయ పెట్టుబడి కోసం ఏడాది క్రితం పెద్దపుటపల్లిలోని ఫైనాన్స్ వ్యాపారి బత్తిన రాజేష్ వద్ద చెరో లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నారు. రాజేష్, అతని సిబ్బంది వారం వారం వాయిదాల రూపంలో ఇంటికే వచ్చి వసూలు చేసుకుంటున్నారు. వడ్డీతో సహా డబ్బులు చెల్లించినా.. తాను తన కుమారుడు ప్రదీప్ చెరో లక్ష ఇంకా కట్టాలని చెబుతున్నారంటూ వాపోయారు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో తన ఇంటికి వచ్చి ఇంకా డబ్బులు రావాలంటూ తనను, తన కుటుంబసభ్యులను రాజేష్ తిట్టి కులం పేరుతో దూషించాడని బాధితుడు వాపోయాడు. కాల్‌మనీ కింద డబ్బులు ఇచ్చానని, బాకీ చెల్లించకపోతే ఇంట్లో సామాను బయటపడేసి ఇల్లు స్వాధీనం చేసుకుంటానని చెప్పాడన్నారు. తమకు రక్షణ కల్పించాలని నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ చేపట్టినట్లు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తెలిపారు.

ఆక్వా గురించి పవన్‌కు ఏం తెలుసు?

అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం



తాడేపల్లిగూడెం: ఆక్వా రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ రాయితీతో సహా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, ఆక్వా గురించి ఓనమాలు తెలియకుండా పవన్ కల్యాణ్ ఊగిపోతున్నారని అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఆక్వా జోన్, నాన్ ఆక్వాజోన్ అంటూ చంద్రబాబు హయాంలో రైతులను మోసం చేసినప్పుడు ప్రశ్నించకుండా పవన్ ఏం చేశారని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం ఆక్వా రైతుల పట్ల చిత్తశుద్ధితో ఈ-ఫిష్ ద్వారా సర్వే చేయించి వ్యవసాయానికి నష్టం జరుగకుండా, ఆక్వా రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకున్నారన్నారు. పది ఎకరాలలోపు ఉన్న ప్రతి రైతుకు యూనిట్ 1.50 పైసలకే అందించిన ఘనత సీఎందే అన్నారు. క్వాలిటీ ఫీడ్ ఇచ్చేలా చర్యలు తీసుకున్న ప్రభుత్వం ఈ ప్రభుత్వమే అన్న సంగతి పవన్‌కు తెలుసా అన్నారు. సీనియర్ మంత్రులతో ఎంపవర్‌మెంటు కమిటీ ఏర్పాటుచేసి సమీక్షలు చేసి ఆక్వా రైతులకు న్యాయం చేస్తున్న ప్రభుత్వం ఇదేనన్నారు. చంద్రబాబు రాసిన స్క్రిప్టు చదవడం కాదు నిజాలు తెలుసుకొని పవన్ మాట్లాడాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల గ్రామానికి చెందిన వనపర్తి చిన సుబ్బారావు మండలంలోని శ్రీనివాసపురంలో బంధువుల ఇంటి వద్ద కొంత కాలంగా నివశిస్తున్నాడు. ఇతను గ్యాస్ పొయ్యిలు బాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీనివాసపురం నుంచి జంగారెడ్డిగూడెం సైకిల్‌పై వస్తుండగా ఏరియా ఆసుపత్రి వద్ద లారీ ఢీకొంది. దీంతో సుబ్బారావు ఎడమ చేయి, కాలు నుజ్జునుజ్జయ్యాయి. మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

భీమవరం అర్బన్: తోకతిప్ప గ్రామానికి చెందిన అన్నదమ్ములు పాత గొడవల విషయమై ఘర్షణకు దిగారు. దీనిపై ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు గురువారం కేసులు నమోదు చేసినట్లు హెచ్‌సీ పి.మహేశ్వరరావు చెప్పారు. తోకతిప్పకు చెందిన పొన్నాల నరసింహరావుకు, అతని అన్న పొన్నాల కృష్ణ మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ నెల 7న పొన్నాల నరసింహరావును అన్న పొన్నాల కృష్ణ, మరో ముగ్గురు కొట్టడంతో అతనికి గాయాలయ్యాయి. అలాగే అన్న పొన్నాల కృష్ణ మరో ముగ్గురు కలిసి చంపేస్తామని బెదిరించి, దుర్భాషలాడినట్లు బాధితుడు నరసింహరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జూదరుల అరెస్టు

పాలకోడేరు: గొల్లలకోడేరులో పేకాట శిబిరంపై గురువారం దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు. నిందితుల నుంచి రూ.33,860 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుల సంరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలి

ద్వారకాతిరుమల: వృద్ధుల సంరక్షణా చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని ఏపీ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడు వీఎస్ మూర్తి కోరారు. స్థానిక బ్రాహ్మణ నిత్యాన్నదాన సదనంలో సంఘం సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. 26 జిల్లాలకు చెందిన 200 మంది పాల్గొన్నారు. ముందుగా జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికలో రాష్ట్ర అధ్యక్షుడిగా వీఎస్ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా కె.రామచంద్రరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కె.నిర్మల, గౌరవాధ్యక్షుడిగా సీహెచ్ పరమేశ్వరరెడ్డి, కోశాధికారిగా కేవీ మోహన్, ముఖ్య సలహాదారుగా హెచ్ హనుమంతురావును సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ వృద్ధులు శేషజీవితాన్ని ఆనందంగా, ఆరోగ్యంగా గడిపేందుకు ప్రభుత్వాలు తోడ్పాటునివ్వాలని కోరారు.

క్లుప్తంగా

లక్ష్మీనారాయణ స్వామికి పంచామృతాలతో అభిషేకాలు



లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏకాదశి పురస్కరించుకొని పట్టణంలోని వాసవి కన్యక పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారికి గురువారం ఉదయం పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలు, ఫలరసాలతో విశేషంగా అభిషేకం జరిగింది. ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నున్న బాలా త్రిపుర సుందరరావు, సెక్రటరీ శ్యాం తదితరులు పూజలలో పాల్గొన్నారు. విశేషంగా భక్తులు హాజరైయారు.

తెన్నేటి జగజ్జీవన్‌కు అభినందనలు



తెన్నేటి జగజ్జీవన్‌కు అభినందనలు తెలియజేస్తున్న పలువురు న్యాయవాదులు, వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పశ్చిమ గోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులుగా ఎంపికైన తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన తెన్నేటి జగజ్జీవన్‌ను గురువారం పలువురు కలిసి అభినందించారు. అభినందించిన వారిలో రూరల్ మండల సచివాలయం ఇంచార్జి ముప్పిడి సంపత్ కుమార్, పట్టణ సచివాలయాల కన్వీనర్స్ కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, రాష్ట్ర హస్త కళల కార్పొరేషన్ డైరక్టర్ మానికొండ వెంకటేశ్వరరావు, వార్డు ప్రతినిధులు కోడే శ్రీను, చామన సూర్యచంద్రరావు, ఎ.రవి, పెంటపాడు ఎంపీటీసీ పొట్ల ఏడుకొండలు, న్యాయవాది జే.సురేష్‌బాబు, టి.జోసెఫ్, కొల్లి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ముత్యాలమ్మకు విశేష పూజలు



ముత్యాలంబపురం ముత్యాలమ్మ వారిని విశేషంగా అలంకరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ముత్యాలంబాపురం ముత్యాలమ్మకు తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం లలితా సహస్రనామార్చన జరిపారు. అమ్మవారిని దర్శించేందుకు స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.హరేరాంప్రసాద్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోశయ్య విగ్రహావిష్కరణ



బంగారుగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం (కూనవరం) గ్రామంలో ఏర్పాటు చేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని గురువారం విగ్రహ దాత కోనా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోశయ్య విగ్రహాలు ఏర్పాటుకు సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కామిశెట్టి కాశీవిశ్వనాథం, కార్యదర్శి అద్దేపల్లి నాగవెంకటసత్యనారాయణ, కోశాధికారి పలివెల అచ్చిరాజు, ఆలయ కార్యదర్శి సమయమంతుల శ్రీహరి, ఆర్యవైశ్య సంఘ పెద్దలు పాల్గొన్నారు.

క్యారీ బ్యాగులు నిషేధించరూ..!

యథేచ్ఛగా వినియోగం



ఇరగవరంలో రోడ్డు పక్క చెత్తలో ఉన్న పాలిథిన్ కవర్లు, క్యారీ బ్యాగులు



ఇరగవరంలో యథేచ్ఛగా క్యారీ బ్యాగులు వినియోగం

ఇరగవరం: ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిషేధం అమలుకు నోచుకోవడం లేదు. పర్యావరణ కాలుష్యం తగ్గాలంటే ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు వాడకాన్ని పూర్తిగా నిషేధించాల్సిన పరిస్థితి ఉంది. తణుకు నియోజకవర్గంలో ఇరగవరం మండలల్లోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీలు ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను నిషేధిస్తూ నిషేధాజ్ఞలు గత ఏడాది డిసెంబర్‌లో నెలలో జారీ చేశాయి. కానీ అమలు మాత్రం లోపభూయిష్టంగా ఉంది. కొంత కాలం క్రితమే ప్లాస్టిక్ నిషేధిస్తూ పంచాయతీ పాలక వర్గలు తీర్మాణం చేసినప్పటికి అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడంతో ఆశయం అభాసుపాలౌవుతుంది. నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని రోజుకు ఒక అర టన్ను క్యారీ బ్యాగ్‌లు వినియోగిస్తున్నారని అంచనా వేసినట్లు వ్యాపారులు చెబుతున్నారు. భూమి, నీరు, వాయువులు కలుషితమవుతాయి. భూగర్భ జలాలు దెబ్బతిని సారవంతమైన పంట భూములు నిస్సారం అవుతాయి. ప్లాస్టిక్ వాడకం వల్ల ప్రమాదకర క్యాన్సర్ వ్యాపిస్తుంది. నాడీ వ్యవస్థతో పాటు ఎర్ర రక్తకణాలు, కాలేయం, మూత్రపిండాలు పై ప్రభావం చూపుతుంది. ప్లాస్టిక్ కాల్చడం వల్ల వచ్చే లిక్విడ్ హైడ్రో కార్బన్ వాయువు వలన గాలి కలుషితం అవుతుంది. పిల్లలు పలు రకాలు లోపలతో పుడతారు. క్యారీ బ్యాగ్‌ల్లో సిగమెంట్లు, పాస్టిసైజర్లు, యాంటి ఆక్సిడెంట్లు ఉండటం వలన వ్యాధులు భారిన పడుతున్నారు. ఇటీవల పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని ర్యాలీ నిర్వహించారు.

ముందస్తు జాగ్రత్తలు మేలు

నిత్యావసరాలకు జ్యూట్, పేపరు, కాటన్ బ్యాగులు మాత్రమే ఉపయోగించాలి. ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలి. పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ అపరధ రుసుములు విధించాలి. స్వచ్ఛందసేవ సంస్థలు చొరవ తీసుకోవాలి. దుకాణదారుల్లో క్యారీ బ్యాగుల నిషేధంలో ప్రజలను భాగాస్వాములను చేయాలి.

చర్యలు తీసుకుంటాం

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వాడరాదంటూ గతంలో గ్రామాల్లో మైక్ ప్రచారం చేయించాం. అన్ని సచివాలయాలకు ఆదేశాలు జారీ చేశాం. వ్యాపారులకు అవగాహన కల్పించాం. క్యారీ బ్యాగులు వినియోగం వల్ల అనర్థాలను వివరించాం. త్వరలో ప్లాస్టిక్ వాడకాలను తగ్గించకుంటే చర్యలు తీసుకుంటాం.

– పమ్మి వెంకట నాగ నరసింహ మూర్తి, ఈవోపీఆర్డీ ఇరగవరం

ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం



ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం. ప్లాస్టిక్ వినియోగం మానవాళితో పాటు జీవాలకు ప్రమాదకరమే. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నయ మార్గాలను అన్వేషించాలి. జనపనారతో సమస్యలు రావని గమనించాలి. క్యారీ బ్యాగ్ వినియోగించడం వల్ల తరచూ రోగాల బారీన పడే అవకాశాలు ఉన్నాయి.

– బంగారు రవి, రేలంగి పీహెచ్‌సీ వైద్యులు

నేత్రపర్వంగా వరాల వెంకన్నకు అభిషేక పూజలు



వెంకటేశ్వరస్వామిని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు 200 లీటర్ల ఆవుపాలతో క్షీరాభిషేకం, 7 లీటర్ల పెరుగు, 7 కిలోల నెయ్యి, 7 కిలోల తేనె, 7కిలోల పంచధార, 7కిలోల పసుపు, 7 కిలోల కుంకుమ, 7కిలోల అష్టగంధం, 7కిలోల వట్టివేళ్లు, 7 రకాల పళ్లరసాలు, 7రకాల చూర్ణాలు, వివిధ సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్వామివారికి విశేష అభిషేకాన్ని జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో అభిషేక పూజలు చేశారు. ఈసందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారికి నిర్వహించిన అభిషేకాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

జగనన్న సురక్షను పటిష్టంగా అమలు చేయాలి



అత్తిలిలో సచివాలయ కన్వీనర్ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ



వేల్పూరులో ఇంటింటికి వెళ్ల వివరాలు సేకరిస్తున్న నాయకులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది

అత్తిలి: గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వలంటీర్లను సమన్వయం చేసుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. గురువారం అత్తిలి గ్రామ సచివాలయంలో మండలంలో గల గ్రామ సచివాలయ కన్వీనర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషిచేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు పొందనివారి వివరాలు తీసుకుని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్ మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి రానున్న రోజుల్లో జరిగే ఎన్నికలకు సమాయత్తం కావాలన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ పెన్మెత్స రామరాజు మాట్లాడుతూ జూలై 1 నుంచి గ్రామాల్లో మండలస్థాయి బృందాలు పర్యటించి జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రభుత్వ సేవలు పూర్తి సంతృప్తి స్థాయిలో ప్రతి కుటుంబానికి అందించడమే ఈకార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. సాంకేతిక కారణాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందని వారి కుటుంబాలను గుర్తించి, వారికి లబ్ధి చేకూర్చే విధంగా సేవలు అందించాలని తెలిపారు. మండలస్థాయి బృందం గ్రామాన్ని సందర్శించడానికి మూడు రోజుల ముందుగానే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతీ కుటుంబాన్ని సందర్శించి వారితో మాట్లాడి వారి సమస్యను విని, వారికి కావాల్సిన సర్టిఫికెట్, డాక్యుమెంట్స్, పథకాలకు అర్హత ఉండి పొందని వాటి గురించి తెలుసుకుని నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటా విజేతనాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, ఎమ్మెల్యో వెలగల విజయభాస్కరరెడ్డి, రిటైర్డు ఎంపీడీవో ఎ ఆంజనేయులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

తణుకు టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం కొమరవరం, కోనాల, ముద్దాపురం, వేల్పూరు 1, 2, దువ్వ 1 గ్రామ సచివాలయం పరిధిలోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులకు అవసరమైన సేవలను గుర్తించి నమోదు చేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. వేల్పూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వివరాలు నమోదు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు చుండ్రు శ్యామల, విజయదుర్గ, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కోనాల, ముద్దాపురం, కొమరవరం, వేల్పూరు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన సేవలకు అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

జగనన్న సురక్షతో పథకాల లబ్ధి



కృష్ణాయపాలెం గ్రామ సచివాలయంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంతో సంక్షేమ పథకాలు అందని ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. గురువారం మండలంలోని కృష్ణాయపాలెం, ఆరుగొలను గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహ సదస్సు నిర్వహించారు. కృష్ణాయపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ అర్హత ఉండి ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరని వారు ఇంటి వద్దకు వచ్చే గృహసారథులు, వలంటీర్లకు తెలియజేస్తే సమస్య పరిష్కరిస్తారన్నారు. అలాగే 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఆరుగొలను గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ నార్ని శంకరరావు, సొసైటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కంఠమని సత్యనారాయణ, గజ్జరపు రామకృష్ణ, నక్కా గంగాధర్, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృత పర్చాలి



అత్తిలిలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

అత్తిలి: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృత పర్చాలని రాష్ట్ర మానవతా కన్వీనర్ కోడూరి రాధాపుష్పవతి అన్నారు. గురువారం అత్తిలిలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షుడు తోట సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా అత్తిలిమండలం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. మండలశాఖ అధ్యక్షునిగా బి సూర్యచంద్రరావు, ఉపాధ్యక్షునిగా పీవీ రమణి, కార్యదర్శిగా కొరిపల్లి హరి, కోశాధికారి కె వెంకట రామారావు, సహాయ కార్యదర్శి జీవైవీ రమణ, ఈసీలుగా సంకు సతీష్‌కుమార్, ఆకుల ఆంజనేయులు, మద్దుల జగదీష్ కుమార్, కె విజయకుమార్‌తో పాటు డైరెక్టర్స్ బోర్డు చైర్మన్‌గా ఆనాల ఆదినారాయణ, వైస్‌చైర్మన్ కంకటాల సతీష్, కన్వీనర్‌గా తోట వెంకటసుబ్బారావు, డైరెక్టర్స్‌గా కె వేణుగోపాలకృష్ణ, ఓ సురేష్‌బాబు, ఎం బాలకృష్ణంరాజు, జి నాగరాజు, కాసగాని హనుమంతరావు, బడేటి వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు.

పట్టణంలో తొలి ఏకాదశి పూజలు





కృష్ణ యోగ ధ్యాన మందిరంలో శ్రీకృష్ణ పరమాత్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం, తాడేపల్లిగూడెం మండలం కూనవరం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆషాడ శుద్ధ ఏకాదశి, తొలి ఏకదశి పురస్కరించుకొని గురువారం పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అదే విధంగా రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో శ్రీకృష్ణ పరమాత్మకు, చింతామణి దేవి అమ్మవారికి పరివార దేవతలకు ఆలయ అర్చకులు ఎం.సీతారామయ్య బ్రహ్మత్వంలో అభిషేకాలు, సహస్ర అష్టోత్తర పూజలు జరిగాయి. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు. అలాగే పట్టణంలోని 5వ వార్డు శ్రీనివాస రామాలయంలో గురువారం వేంకటేశ్వరస్వామికి, సీతా సమేత రామచంద్రులు వారికి పంచామృతాలతో అభిషేకాలు, అనంతరం లక్ష తులసి పూజ జరిగింది. ఆలయ చైర్మన్ శానం రామకృష్ణ పర్యవేక్షించారు. ఆర్టీసీ బస్సు డిపో వద్ద వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హోమాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కూనవరం గ్రామంలో ఏర్పాటు చేసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం హోమాలు నిర్వహించారు. సమయమంతుల శ్రీహరిరావు ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి వారికి పురోహితులు పవన్ శర్మ ఆధ్వర్యంలో అష్టోత్తర సహస్రనామార్చన జరిపారు. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం చేశారు.

నారుమడులు త్వరితగతిన పూర్తి చేయాలి

భీమవరం అర్బన్: వరి నారుమడులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. భీమవరంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం స్థానిక విలేకరులతో ఏవో నిమ్మల శ్రీనివాస్ మాట్లాడారు. తొలకరి వర్షాలు పడుతున్నాయని ముందస్తు సార్వా సాగు చేస్తే అక్టోబర్, నవంబర్‌లో వచ్చే భారీ వర్షాలు, తుపానుల ధాటి నుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు. రైతులు త్వరితగతిన నారుమడులు పూర్తి చేయాలని కోరారు. ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 1318, స్వర్ణ రకాల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కేజీ విత్తనాలు సబ్సిడీపై రైతు భరోసా కేంద్రాలలో, డీసీఎంఎస్‌లలో అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు ఆర్‌బీకే సెంటర్లలో బుక్ చేసుకోవాలని కోరారు.

మత సామరస్యానికి నిలయం భారతదేశం



మాట్లాడుతున్న బిషప్ యం.దేవిడ్ లివింగ్‌స్టన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారతదేశం మత సామరస్యానికి నిలయమని ఆల్ ఇండియా క్రిస్టియన్ కమిటీ (ఏఐసీసీ) జిల్లా నాయకులు అన్నారు. ఏఐసీసీ జిల్లా సమావేశం గురువారం భాగ్యలక్ష్మీపేటలోని ఎల్ఎల్ఎం విమోచన ప్రార్థనా మందిరంలో నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ దేశంలో మతపరమైన అల్లర్లు, మత విద్వేషాలతో రగిలిపోతూ క్రైస్తవులపై దాడులు చేస్తూ హింసించడం, చంపడం, మందిరాలను కూల్చివేయడం బాధాకరమన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రెసిడెంట్ బిషప్ యం.డేవిడ్ లివింగ్‌స్టన్, జిల్లా అధ్యక్షుడు రాజాబాబు, రాష్ట్ర కోఆర్డినేటర్ డానియల్ రాజు, సెక్రటరీ విలియమ్స్, ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షుడు కైలాస డానియల్ తదితరులు పాల్గొన్నారు.

జర్మన్ వర్సిటీతో ఎస్ఆర్‌కేఆర్ ఒప్పందం

సాక్షి, భీమవరం: విద్యార్థులు జర్మనీలో స్కాలర్‌షిప్‌తోపాటు ఉన్నత విద్య అభ్యసించేందుకు అక్కడి విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ గురువారం చెప్పారు. జర్మనీలో విశ్వవిద్యాలయాలను సందర్శించి ఇండో యూరోపియన్ సింక్రనైజేషన్ (ఐస్) సహకారంతో జర్మనీ యూనివర్సిటీ అధికారులతో సమావేశమై ఒప్పందం చేసుకున్నామన్నారు. దీనిలో భాగంగా నాలెడ్జ్, స్కిల్ ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయన్నారు. ప్రాజెక్టుల రూపకల్పన, కళాశాల స్థాయిలోనే జర్మన్ భాష నేర్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు వత్సవాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే

తణుకు: పూర్వపు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి డాక్టర్ బీసీ రాయ్ జయంతి పురస్కరించుకుని జులై 1న ప్రతి ఏటా నిర్వహించే డాక్టర్స్ డే సందర్భంగా తణుకులో వత్సవాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు డాక్టర్ వి.వెంకటరాజు తెలిపారు. స్థానిక రోటరీ క్లబ్ ప్రాంగణంలో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పద్మశ్రీ ఎంఆర్ రాజు పాల్గొంటారని చెప్పారు.

అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

సాక్షి, భీమవరం: అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. గునుపూడికి చెందిన గ్రే హౌండ్స్ కానిస్టేబుల్ పి.సుధీర్ బాబు 15వ వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ బలిమెల రిజర్వాయర్ వద్ద నక్సల్స్ జరిపిన దాడిలో సుధీర్‌బాబు ప్రాణాలు అర్పించి అమరుడయ్యాడన్నారు. అనంతరం సుధీర్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధీర్‌బాబు దేశం, రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప వ్యక్తి అని ఆయన చేసిన సేవలను కొనియాడారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

సాక్షి, భీమవరం: యువత వ్యసనాలకు అలవాటు పడకుండా మంచి మార్గంలో నడవాలని బ్రౌనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎలీషా అన్నారు. పట్టణంలోని బ్రౌనింగ్ కళాశాలలో గురువారం ఎస్ఐఓ ఆధ్వర్యంలో యువత సమస్యలు, కారణాలు, పరిష్కారం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని వివరించారు. చెడు మార్గంలో పయనించకుండా చదువుపై దృష్టి సారించి మంచి భవిష్యత్‌ను ఏర్పర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐఓ శాఖ సభ్యులు మొహ్మద్ తాహా, ఎండీ సమీర్, షేక్ సుభాని పాల్గొన్నారు.

పట్టణంలో ఆనందోత్సవాల మధ్య బక్రీద్ పండుగ



పెద్ద మసీద్ ఈద్గా ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బక్రీద్ పండుగను పట్టణంలోని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మసీద్ మత గురువు మౌలానా మహమ్మద్ అన్వర్ హాసిని బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. బక్రీద్ విశిష్టతను వివరించారు. విలువలకు, త్యాగానికి బక్రీద్ పండుగ ప్రతీక అని మౌలానా మహమ్మద్ అన్వర్ హాసిని అన్నారు. ఈద్ ప్రార్థనలో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ రఫాద్, కార్యదర్శి సర్దార్ ఖాన్, పెద్దలు మహబూబ్ బాషా, బాబర్ బాయ్, ఆటోవలి, ఎస్కే నౌషాద్ మోహిద్దీన్‌లు పర్యవేక్షించారు. పెద్దలు, యువకులు, పిల్లలు ప్రార్థనలో పాల్గొని ఒకరినొకరు ఆలింగనాలతో శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో, అన్ని మసీద్‌లలోను మత ప్రార్థనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.